# అభిరుచులు

రచన :
"పుష్యమి".

(గత సంచిక తరువాయి)

'పోనీ; ఈపైనించి నువ్వే వాడి బాధ్యత వహించు! నే వెనకేసుకొచ్చా కనక, నువ్వు ముందేసుక వచ్చి, వాణ్ణి బాగుచెయ్యి! ఎవరు వద్దన్నారు?' అనేసి, యింక ఆమెతో వాదించ యిష్టంలేక బయటికి వెళ్ళిపోయాడు హనుమంతరావు;

నాలుగు రోజులు గడిచాయి!—

ఈ నాలుగురోజులలోనూ, రవిలో చెలరేగిన తుఫాను అతీతం! పరీక్ష పోయినందుకు తనలో తనే కుమిలి పోయాడు!

'నాన్న తిరిగి చదివించే పరిస్థితిలో లేడు! తను కష్టపడి చదువుతే యిలా పరీక్షపోనా? పరిస్థితులు తెలిసికో గల ప్రపంచజ్ఞానం ఉన్న తానే యిలా అశ్రద్ధ చేసి, నాన్న మనసుకు ఎంతబాధ కలిగించానో?' అని బాధ పడ్డాడు!

'పోనీ చదువుమానేసి, తాను ఏదైనా ఉద్యోగం చేస్తే?—నాన్నకి సహాయంగా కూడా వుండచ్చు!... కాని; థర్డుఫారం ఫెయిలయిన తన కెవరిస్తారు ఉద్యోగం? నాన్నతోబాటే కొట్లోకివెళ్ళి ఎక్కౌంటు నేర్చుకుంటే?...ఛీ!—ఆ షాహుకారు గుమాస్తా గిరీ తాను చేయలేడు! ఎంతచేసినా సంతృప్తివుండదు వాడికి! అంతా అలాగే ఉంటారేమిటి కాని: ఆ ఎక్కౌంటు తేలిగ్గా వస్తుందా? చాలాకాలం నేర్చుకోవాలి! అంత దాకా తను నాన్నకి బరువేకదా!... వెంటనే దొరికే నౌఖరీ ఏదీలేదు!...ఎలాగ? అటూ చదువూ లేదు! యిటు సంపాదనా లేదు!—యిలా ఖాళీగా; ఊరికేతిని కూర్చోడం ఎంతకాలం?' తన బాధ్యతా, పోషణభారం తండ్రికి తప్పిద్దామనే ఆలోచనలో పడ్డాడు రవి! సంపాదనికి మార్గాలు వెతకటం మొదలు పెట్టాడు! చదువా తక్కువ! వయసా లేదు! ఎవరిస్తారప్పుడే ఉద్యోగం?— ఏం ఉద్యోగం చేస్తాడు? అశగాని!!

ఆరాత్రి తెల్లవార్లూ ఆలోచిస్తూనే ఉన్నాడు రవి! నిద్దరే పోలేదు!!

రఘుని చదివిస్తే వృద్ధిలోకి వస్తాడు రఘు తనకంటె తెలివైనవాడు కూడా! తను తిని యింట్లోనే కూర్చుంటే, తమ్ముడి చదువు థర్డుఫారంలోనే ఆగిపోవచ్చు! జీతం కట్టి ఆపైన చదివించలేక నాన్న రఘునికూడా బడి మానిపించేయవచ్చు! తాను ఏ కొద్దిగానో సంపాదిస్తే, రఘు చదువుకి అటంకం కలగకండా చూడవచ్చు!— వాడేనా చదివి పైకివస్తే, సంసారాన్ని ఒక వడ్డుకి చేర వేసి, నాన్న కష్టాల్ని ఆలోచిస్తాడేమోనని తలపోశాడు రవి!

జీతం ఎలాగా లేదు కనక, రఘుని థర్డుఫారందాకా నిర్విచారంగా చదివిస్తాడు హనుమంతరావు. ప్రస్తుత సంసార పరిస్థితులు చూస్తే! ఏపో! రఘు చదువు ఏమవు తుందో ఆపైన! ఇటు, ఆర్థిక పరిస్థితులవల్ల, చదువుకీ ఆటంకం కలుగుతూంటే, రఘుకి సంగీతం కూడా ఎలా నేర్పిస్తాడు హనుమంతరావు?

రవిని తిరిగి బడికి వెళ్లమని అన లేదు! రవి వెళ్ళనూ లేదు!

పిల్లలిద్దరి భవిష్యత్తూ, యిలా నాశనమై పోతూంటే, తాను చేయగలిగింది గుండె రాయి చేసుకోడంమాత్రమే అనుకున్నాడు హనుమంతరావు !...ఏం చేస్తాడు?...

రత్తమ్మకి ఈ బాధలేమీ అక్కరే లేదు! వేళకి యింతవండి; తినడం తప్పించి, వేరు విషయాలు ఆమె పట్టించుకోదు! ఆమెది వింతనైజం! అది అర్థంకాదెవరికీ! కన్న కొడుకులగూర్చి ఒక్కనాడయినా ఆలోచించని ఆమె ప్రకృతి హనుమంతరావుకీ అర్థం కాలేదు!

రవి ఆరాత్రి ఆలోచించి;...ఆలోచించి; చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు!—తా నెక్కడకైనా పోయి, డబ్బు సంపాదించి, తండ్రికి సాయంచేయాలని సంకల్పించాడు! తండ్రితో చెపుతే వప్పుకోడని తెలుసు!... చెప్పకుండానే పోయి, పని దొరికాక తా నెక్కడున్నాడో తెలియజేయవచ్చని నిశ్చయించాడు!

తెల్లవారకట్ల గం. 4 లు అయింది టైము! ఇంట్లో ఎవరూ యింకా లేవలేదప్పటికి! అంతా నిద్దుర పోతున్నారు! రైలు రావటానికి యింకొక్క అరగంట వుంది! ఆ రైలుకుపోదామని, లేచాడు రవి! తను దాచు కున్న డబ్బు లెన్నున్నాయో, డబ్బాతీసి చూశాడు!— పద్నాలుగణాలున్నరవుంది! అవి తీసి జేబులో వేసు కున్నాడు! అమ్మా నాన్నా వైపొక్కసారిచూచి, బరువుగా అడుగులేస్తూ బయటికి వచ్చేశాడు!

(తరువాయి 23వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

రైలెక్కాడన్నమాటేగాని, మనసు కుదురుగాలేదు! పొద్దున్నే లేచి, తానింట్లో లేకపోతే, అమ్మా నాన్నా ఖంగారుపడరూ?—అతనిలో భయం ప్రవేశించింది!

"తానిప్పుడు ఎక్కడకు వెళ్ళాలో—
ఏమో!..."

"ఏ ఉద్యోగం చెయ్యాలి?—
ఏది దొరికితే అది!..."

"ఎలా ఉద్యోగం సంపాదించటం?—
దేముడే చూపిస్తాడు!..."

— యిలా తనలో తలెత్తే ప్రశ్నలన్నిటికీ ధైర్యంగా తనే సమాధానం చెప్పుకుని, కళ్ళు మూసుకు కూర్చున్నాడు!

ఆలోచనలతో రాత్రి తెల్లవార్లూ నిద్దరలేకపోవడం మూలాన, రైలు కుదుపుకి, హాయిగా నిద్దరపడుతోంది ఏపుగా పెరిగిన పచ్చని పైరులమీంచివచ్చే పిల్లగాలి శరీరాన్ని మత్తెక్కిస్తోంది; అలాగే నిద్దరపోతూ, రైలు ఆగిన కుదుపుకి కళ్ళు తెరుస్తూ; కునికిపాట్లుపడుతున్నాడు రవి! !

రైలు తిరిగి ఆగింది!—రవి కళ్ళు తెరిచి చూచాడు! ఎదురువచ్చే రైలుకోసం ఎదురుచూస్తోంది ఈ రైలు అది రెండు రైళ్లూ 'క్రాస్' అయ్యే స్టేషను!—ఆ రైలు వచ్చేదాకా, ఈ రైలు ఆగుతుంది!...తిరిగి కళ్ళు మూశాడు రవి!...

తిరిగి;—'రవీ!' అన్న పిలుపుకి, అదిరిపడిలేచి, ఆశ్చర్యంగా చుట్టూ చూచాడు రవి.

'రైలులో 'రవీ!' అని, అంత చనువుగా పిలిచే దెవరు?' అని, భయంతో చుట్టూ కలయచూచాడు ఆ వ్యక్తికోసం!—ఆ పెట్టెలో తనకు తెలిసినవారు ఎవరూ లేరు!...భ్రమపడ్డానేమోనని, తిరిగి కళ్ళు మూశాడు!

'రవీ!' తిరిగి పిలుపు!...

'యిక్కడరా!...యిటు!...' అంటున్నారెవరో!—ఎక్కడో పరిచయమున్న కంఠం!...ఆ స్వరం వచ్చిన వైపు చూచాడు....

అవతల లైనుమీద యింకొక రైలు ఆగివుంది! ఆ రైలులో; తనకెదురుగా ఉన్న పెట్టె కిటికీలోంచి తన వైపుకే చూస్తున్న వ్యక్తిని చూచి; బిగిసిపోయాడు రవి!...భయంతో వణికాడు!...

రవి మేనమామ ఆ రైలులోనే, చెల్లెలు రత్తమ్మను చూద్దామని వస్తున్నాడు! మధ్యలో, రైలులో కనిపించిన రవిని చూచి ఆశ్చర్యపడి, పిలిచాడు!

'రవీ! యిలా రా!...తొందరగా!...ఊఁ!...రైలు కదులుతోంది!...రా!' అని కేకేశాడు!

రవి గబగబాలేచి, ఈ రైలు దిగి, ఆ రైలు ఎక్కాడు

'ఎక్కడికిరా వెడుతున్నావ్ రవీ?' అడిగాడు రవిని సుందర్రామయ్య!

ఎక్కడికని చెపుతాడు రవి?...తనకి మాత్రం తెలుస్తేగా!—

కట్టలు తెంచుకుని, ఆపుకోలేని దుఃఖం పొంగి వచ్చింది! కళ్ళు రెండూ జలపూరితాలయాయి! చెపుదామంటే నోరు పెకలలేదు! అది చూచి ఆశ్చర్యంగా అడిగాడు సుందర్రామయ్య,

'ఏరా? ఏడుస్తున్నావేం?'

'ఈఏడు నా పరీక్ష పోయింది మామయ్యా!' వచ్చే ఏడుపు 'ఆపుకోడానికి ప్రయత్నించాడు రవి!

'పరీక్ష పోయిందా?—అయితే? దానికి ఏడవడం ఎందుకురా?'

వాళ్లు కూర్చున్న రైలు కదిలింది—

యిక ఎలాగా చెప్పక తప్పదని, అసలు తానెందుకు యింటినుంచి బయల్దేరాడో పూర్తిగా చెప్పేశాడు రవి!

రవి చెప్పినదంతా విని; హనుమంతరావు సంసారం ఎటువంటి కష్టసమస్యల నెదుర్కుంటూందో అర్థం చేసుగోగలిగాడు సుందర్రామయ్య!

'సరే! నేచెప్తాలే! నేనూ మీ యింటికే బయలుదేరి వస్తూంట! నాతో రా! ఫరవాలేదు!' అని, రవికి ధైర్యం చెప్పి, తనతో తిరిగి వెనక్కి తీసుకొచ్చాడు!

రవీ, సుందర్రామయ్యా, యిల్లు చేరుకునేసరికి తెల్లవారి, ఎనిమిదయింది! 'పొద్దున్నే ఎక్కడికి వెళ్ళావు?' అని రత్తమ్మ అడుగుతుందేమోననుకున్నాడు రవి! కాని, అన్నగారి ఆగమన ఆనందంలో ఆ విషయప్రస్తావనే రాలేదు!

'అమ్మయ్య! అనుకున్నాడు రవి! దడదడలాడుతున్న గుండె వేగం తగ్గింది!

సుందర్రామయ్య తిరిగి వెళ్ళిపోడానికి లేచేముందు, రత్తమ్మను పిలిచి అన్నాడు—

‘అమ్మాయీ! రవిని నాతో మాయింటికి తీసుకువెడదామనుకుంటున్నాను! అక్కడుండి చదువుకుంటాడు!’ అని.

‘వాణ్ణెందుకురా? యింకా నీ కంత చదివించాలని సరదాగావుంటే రఘుని తీసుకెళ్ళు! వీడిలా చదువులో మొద్దుకాదు! నీ సరదాకూడా తీరుతుంది!’ అందిరత్తమ్మ కుండ బద్దలుకొట్టినట్టు మాటాడింది!

‘రఘు నిన్ను విడిచిపెట్టివుండగలడులే? వాణ్ణివదలి నువ్వుండగలవా! రవంటే కాస్త ఈడొచ్చినవాడు కనక ఆ బాధ లేదు’ అన్నాడు సుందర్రామయ్య!

‘నీ వుద్దేశ్యం వేరులేరా అసలు! వాన్ని చేరదీస్తే, నీ కూతురినిచ్చి పెళ్ళి చెయ్యవచ్చని నీ ఆశ! అయినా, ఎవరిని తీసుకెళ్ళడానికేనా నా యిష్టం ఎవిటి? అందులోనూ, అటువంటి ఉద్దేశ్యమే కనక నీకువుంటే, ఆయనతో చెప్పి తీసుకెళ్ళు! లేకపోతే ముందుముందు మీరూ మీరూ తగువులాడుకోవాలి!—నా అభ్యంతరం ఏమీ లేదు!’ అంది రత్తమ్మ అర్థోక్తిగా!

‘ఈ విషయం బావతో యిదివరకే చెప్పానే! నీ యిష్టమెలావుందో అడిగి, అలా చేయమన్నాడు!’

‘అయితే, సరే! అలాగే తీసుకెళ్ళు’ అంది రత్తమ్మ!

తాను చదివించలేనపుడు వాడెక్కడవుంటే ఏం?-పెళ్ళి విషయమా? ఎవరినో ఒకరి నెరాగా కట్టబెట్టాలిగా!—ఆ కట్టబెట్టేది సుందర్రామయ్య కూతురునే కట్టబెట్టవచ్చు!-వాడి బాధ్యతంతా అందాకా అతడే భరిస్తాడు!—అనుకుని, రవిని సుందర్రామయ్యతో తీసుకువెళ్ళడానికి అడ్డుచెప్పలేదు హనుమంతరావు!

సుందర్రామయ్య. రవిని తీసుకుని వెళ్ళిపోయాడు!

తిరిగి రవిని బడిలో ప్రవేశపెట్టాడు! మళ్ళా ఘోర్తుఘారం చదవటానికి చిన్నతనంగా ఉన్నా, మామయ్య పట్టుమీద తప్పలేదు గవికి!

* * *

రవి యింట్లో లేకపోవడం ఏదో లోటుగా వుంది! పదిరోజులు ఏమీ తోచలేదు హనుమంతరావుకి! పిచ్చెక్కినట్లయిపోయింది! ఏ పనీ చేయడానికి మనసు పోలేదు!

రవిని మేనమామ ప్రేమలోనే చూస్తాడు! కాబోయే అల్లుడుగా!—రవి కక్కడ ఏలోటూ రాదు! అయితే ఏం?...యింతవరకూ రవిని విడిచి తను దూరంగా ఏనాడూ లేడు! అసలటువంటి పరిస్థితే రాలేదెప్పుడూ కాని;...ఈనాడు అది తటస్థపడింది!

‘తన కొడుకును పరాయిపంచకి పంపుత—వాడి బాధ్యతా, బరువూ, తాను మోయలేకనేగా? దానికి కారణం దన దారిద్రావస్తేగా?—పరిస్థితుల మూలంగా కావి, తాను రవినివిడిచి వుండటానికి సహించేవాడేనా? పాపం! రవి మనసు ఎంత వ్యాకులపడుతోందో!! లోకాన్నీ; సంసారపరిస్థితుల్నీ అర్థం చేసుకోగలవయసు తనబాధ బయటికి కనపడనీయలేదు!’ అనుకున్నాడు రవినిగూర్చి ఆలోచిస్తూ!

తప్పని సరి అవడం మూలాన, రవి ఎడబాటుకి అలవాటు పడిపోయాడు హనుమంతరావు!-బలవంతాన!!

* * *

రవికి లోపల భయంగానే వుంది! ఎంత మేనమామ యిల్లయినా; ఆ కొత్తచోట తాను ఎలా మసులుకోవాలా?-అని భయం! అత్తయ్య తనంటే యిష్టాన్నే చూపిస్తుందో! యీసడించే పారేస్తుందో! అయినా యింటి యజమాని సమ్మతిలో తానా యింట్లో ప్రవేశించేటప్పుడు, ఆవిడ ఏమంటే తనకేం? మావయ్య కూతురు లక్ష్మి బలే అల్లరిచేస్తుంది! తనకి కాస్త కాలక్షేపంగానే వుంటుంది! మరి అక్కడ నాలుకాలు వేసే వాళ్లు ఎవరేనా ఉన్నారో? లేరో? ఉంటే బాగుండును! లేకపోతే నలుగురినీ తనే పోగుచేయవచ్చు!-అనుకున్నాడు రవి, మేనమామ యింటిలో అడుగుపెట్టక ముందు!

రవిని వెంటబెట్టుకురావడం చూచి; గుడ్లు యింత చేసుకుని చూసింది సుందర్రామయ్య భార్య, రామలక్ష్మి!

‘ఏవిటండోయ్! వీణ్ణి వెంటబెట్టుకొచ్చారు?’ అని గుమ్మంలోనే అడిగేసింది! అలా అడుగుతుందని సుందర్రామయ్య ఊహించక పోలేదు!-అందుకే, తగిన జవాబు వెంటనే యిచ్చాడు!

‘నిన్ను చూడాలని వుందిలే వీడికి! వస్తానని చంపేస్తే, సరేరారా-అన్నాను!-మనంటే వీడికెంత ఆపేక్ష అనుకున్నావ్!-వెళ్ళగానే—

‘అత్తయ్య కులాసాగా వుందా?’ అని అడిగాడు! నువ్వంటే వీడికి పంచప్రాణాలూను!’

ఆమాటలు వింటూ, ఉబ్బి తబ్బిబ్బయిపోయింది రామలక్ష్మి!—దానికి సాయం,

'నిజమత్తయ్యా! నాకు ఎప్పటినించో నిన్ను చూడాలని వుంది' నువ్వు చాలా మంచిదానవత్తయ్యా! ఆవేళ పోసిన పెరుగు యింకా మర్చిపోలేదత్తయ్యా!—నిన్ను చూడాలనే మామయ్యతో వచ్చేశాను!' అన్నాడు రవి! రవి సమయస్ఫూర్తికి, సుందర్రామయ్య ఆశ్చర్యపోయాడు!

'మంచిపని చేశావురా! నిజంగా నేనంటే నీకంత అభిమానంరా? ఎంత యోగ్యుడవురా!—ఏవండీ! చూశారా! వెధవకి నేనంటే ఎంత ప్రాణం! పనికట్టుకు వచ్చాడు చూడ్డానికి!' అంది రామలక్ష్మి సంతోషంలో ములిగిపోయింది!

తనెంత మంచిదనగానే ఉబ్బిపోయి, ఉక్కిరిబిక్కిరి చేసేటంత ఆనందంలో వీధిలో వాళ్ళమీద ఓమారు విరుచుకు పడింది!

'వెధవలు! వీధిలో వాళ్ళంతా, 'పిసినిగొట్టు రావమ్మ!' అని ఏడుస్తారు! నాలో ఎంత మంచితనం లేకపోతే, వాడి నోటంట ఆమాట వస్తుంది? దూరాన్ని వుండి వాడు గుర్తించగలిగిన నా మంచితనం; దగ్గర ఉన్న వాళ్ళకి కనపడటం లేదు!—ఎంత పెట్టినా ఒకటే వీళ్ళకి! ఎదటివారి లోటును ఎత్తిచూపే ఏబ్రాసిపీనుగులు!' తన మంచితనం యీనాటికైనా ఒకరిచేత గుర్తించబడిందని ఆమె సంతృప్తి! ఏదో మాటవరసకన్న మాట. రామలక్ష్మిని ఆకాశంమీద కెత్తేసింది!

రవి, చిన్నప్పుడోసారి వస్తే—తోరకల పెరుగు కావాలని మారాం చేస్తే, మజ్జిగలో కాగితం ముక్కలేసి, అవి తోరకలేనని చెప్పి ఊరడించారు! పాపం! రవి, అవి నిజంగా తోరకలేనని భ్రమపడి, ఏడుపుమానేశాడు! ఆ తర్వాత వాడు చూడకుండా, మామూలు మజ్జిగతో అన్నం కలిపిపెట్టింది రత్తమ్మ! ఆ మోసం తెలుసుకోలేని రవి, రామలక్ష్మి తనకి నిజంగా తోరకల పెరుగు పోసిందనుకుని, 'అమ్మా! అత్త చాలా మంచిదే! నాకు పెరుగుపోసింది!' అన్నాడు!- ఆమాటలే జ్ఞాపకం వచ్చాయి రామలక్ష్మికి!

'వెధవకి, ఆ పెరుగూ అన్నం యింకా జ్ఞాపకంవుంది! ఈ ఊళ్ళోవాళ్ళకెంత పెట్టినా ఒకటే! మెప్పా మెహర్బాణీ ఏడుస్తేగా!' అని విసుక్కుందోసారి!

'అవునులే! ఉన్నచోట ఎంత గొప్పవారికైనా పరువుండదు!' అని తనలోతనే సమాధానపడింది!

'యింతకీ తను మంచికేకదా!—వట్టి మంచేమిటి?—'చాలా మంచిద'ని రవి అంటేను!' అనుకుని ఆనందపడింది!

కొంతమంది ఆడవాళ్ళకి, ఎదటివాళ్ళు పొగుడుతుంటే ఆనందంలో ములిగిపోతారు! వాళ్ళకెప్పుడూ ఎదటివాళ్ళచేత పొగిడించుకోవాలని వుంటుంది!

తను వండినది ఎంత తగులాడినాసరే, 'చాలా బాగుంద'ని తింటేనే భర్త గౌరవం దక్కేది! లేకపోతే,—'మీనోరే అంత అసలు!' అనేస్తారు కొందరాడాళ్ళు భర్తల్ని! ఆ వస్తువుయొక్క యదార్థ రుచి మరి వారి నాలుకకి తెలియదేమో!!

ఆ చేసింది, అందరూ మెచ్చుకునేలా లేనపుడు, తను చేసినపని, తానేనా మెచ్చుకుంటే ఆత్మసంతుష్టి వారికది!!

సుందర్రామయ్యా, రవీ కలసి రామలక్ష్మిని అమాంతంగా మంచిదాన్ని చేసేసేసరికి, ఆ యింట్లో అనుకోని ప్రశాంతత ఏర్పడింది! రాగానే రవిని చూచి, 'గయ్ గయ్' మంటుందనుకున్న రామలక్ష్మి వాతావరణాన్ని ప్రశాంతం చేసిపడేసింది!

'నిజంగా మంచిదే! అప్పుడప్పుడు కోపం రావడం ఎవరికేనా సహజం!' అని సమాధానపడ్డాడు సుందర్రామయ్య, భార్యనుగూర్చి ఊహిస్తూ!

'యిక ఫరవాలేదురా అబ్బాయ్! కోటలో పాగా వేసినట్లే!' అన్నాడు సుందర్రామయ్య!

'అమ్మయ్య!' అనుకున్నాడు రవి!

నాలుగు రోజులు పోయాక, ఏకాంతంలో రామలక్ష్మితో చెప్పాడు సుందర్రామయ్య,

'మన లక్ష్మిని, రవికిచ్చి పెళ్ళిచేస్తే ఎలా వుంటుంది?' అనడిగాడు!

'ఎలావుంటుందంటావేమిటీ? బంగారం ముద్దలా వుంటుంది! అటువంటి యోగ్యుడు నాకు అల్లుడైతే, నా కూతురెంతో సుఖపడుతుంది!' అంది రామలక్ష్మి!

యింత తేలిగ్గా ఆవిషయం తేలిపోయినందుకు, దేముడికి చేతులెత్తి దండం పెట్టాడు! 'అయితే!, వీణ్ణి యిక్కడే వుంచుకుని చదివిద్దాం!' అన్నాడు! 'సరే!' అంది రామలక్ష్మి!

ఒక వ్యక్తిమీద, ఒకవిధమైన మంచిభావం తనకు ఏర్పడినపుడు; ఆ వ్యక్తి తనకెంతో ఆప్తుడవుతాడు! ఆ సద్భావం, యిక ఆ వ్యక్తికి వ్యతిరేకంగా మాట్లాడనీయదు!

అదే,-రవీ—రామలక్ష్మిల విషయంలో జరిగినది!

యిప్పుడాయిల్లు ప్రశాంతతని పొందింది! దానికి, రామలక్ష్మికదూ కారకురాలు?—

అందుచేత 'రామలక్ష్మి మంచిదే!' నిజంగా!

రవి ఆ యింట్లోంచి వెళ్లాక రత్తమ్మ గొడవ కొంత తగ్గింది! ఎప్పుడూ, ఏదో ఒక విషయంమీద, కారాలూ మిరియాలూ నూరే రత్తమ్మ, రఘుని అలా చూడదుగా మరి! వాడు ఏ తుంటరిపని చేసినా ఆమె ముఖంలో ఆనందంతప్ప, కోపం అన్నది మచ్చుకైనా కనపడదు!

రవి వెళ్ళి రెండు నెలలు గడిచినా; రత్తమ్మ కసలు వాడి ధ్యాసే లేదు! ఏమిటో ఆమె వింత మనస్తత్వం?... కొడుకు దూరంగా వుంటే, వాణ్ణిగూర్చి ఒక్కసారైనా తలవని తల్లి వుంటుందా? 'పాపం వాడక్కడ ఎలా ఉన్నాడో? వాడికక్కడ అనుకూలంగా ఉందో లేదో!' అని వాపోతారు! వాడెంత అక్కడ సుఖజీవనం గడుపుతున్నా, వాడేదో అసౌఖ్యంతో బాధపడుతున్నట్టు బాధపడతారు!

అటువంటిది, రత్తమకసలు రవి ప్రసక్తే లేకపోవడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది!

హనుమంతరావు ఆర్ధిక పరిస్థితులు కొంతవరకూ చక్కబడ్డాయి! అలాగే బాధపడుతూ, అప్పులు చాల వరకు తీర్చేశాడు! రవి యిక్కడ లేకపోవడం కొంత బరువు తగ్గిందనే చెప్పాలి!

నాలుగు నెలలు అయేసరికి మూడువంతుల అప్పులు తీరిపోయాయి.

రత్తమ్మ తిరిగి, యింట్లో రోజుకో పిండివంట చెయ్యడం మొదలెట్టింది! సరుకులు కొట్టుమీద పద్దురాసి తెప్పించేస్తుంది! హనుమంతరావు యింటికి వచ్చేసరికి, ఏదో ఓ కొత్త పిండివంట తయారుచేస్తోంది!

'ఏవిటి యిదంతా?' అనడిగితే?

'ఈవారం 'ఆంధ్రప్రభ', 'ప్రమాదావనం'లో కొత్త రకం పిండివంట గురించి వ్రాసిందండీ! ఎలా వుంటుందో అని చేసి చూశాను!' అంటుంది.

ఏమంటాడు హనుమంతరావు? పద్దంటే విరుచుకుపడుతుంది! 'ప్రమదావనం'లోనిది ఓసారి; 'వనితాలోకం' లోదని మరోసారి; యిలా రోజుకో కొత్తరకం తయారు చేస్తోంది! చిల్లరకొట్టుమీద కాతా, తడిసి మోపెడవుతోంది!

ఈ 'ప్రమదావనం' నాకు చాలా 'ప్రమాదవనం'లా వుంది! ఈ 'వనితాలోకం' నాకు యిహలోకంలోనే యమలోకాన్ని' సృష్టిస్తోంది నాకోసమే పుట్టాయేమో ఈ రెండూ!' అనుకున్నాడు హనుమంతరావు మిథగా!

'డబ్బుండి, చేసుకోగలిగినవాళ్ళకి గాని, మనకెందుకే ఇవి?' అన్నాడు!

'అబ్బే! నేనే యింత చేస్తున్నానా? ఊరికే సేంపిలు చూడ్డానికని చేసాను! అంతే!' అంది రత్తమ్మ!

ఇలా అయిందాకుల్లోనూ; కానిది కంచాలోనూ, పెడుతూ సంసారాన్ని యింకా అధోగతికి నెడుతోంది రత్తమ్మ!

* * *

రవి బడికి వెడుతున్నాడేగాని, దృష్టంతా హనుమంత రావుమీదే వుంది! తానెదో సంపాదించి, తండ్రికి సాయం చేద్దామనుకున్నాడు;—అంతా తారుమారయింది! రఘుని ధర్టుఫారం అయాక మానిపించేస్తారేమో నని అతని భయం! అప్పటికేనా, తను ఉద్యోగంలో ప్రవేశించి, రఘు చదువుకి సాయం చేద్దామని అనుకున్నాడు!

ఆ సంవత్సరం దసరపండుగలకి, ఊళ్ళో నవరాత్రి ఉత్సవాలు జరిపారు! పిల్లల్ని నలుగురినీ కూడ దీసి, ఆ ఉత్సవాలలో నాటికలు ఆడించాడు రవి! చాలా బాగున్నాయి. నాటికలని అంతా మెచ్చుకున్నారు! నాటకాలంటే కిట్టని రామలక్ష్మి కూడా, రవి అద్భుత నటనా చాతుర్యం చూచి, ఆశ్చర్యపోయింది. 'చాలా బాగుంది నాటకం! ఈ మాత్రంగా నాటకాలాడేవాళ్లు కూడా ఏడిశారూ ఈ పాడు ఊళ్ళో?' అంది.

'పోనీలే! అమ్మలా తిట్టిపొయ్యకుండా, బాగుంది' అంది అత్తయ్య! అందరూ అలా ఆడిపోసుకుంటారే కాని, అత్తయ్య చాలా మంచిదే నిజంగా!' అనుకున్నాడు రవి!

కొన్ని రోజులు పోయాక, ఊళ్ళో కుర్రగాళ్ళందరినీ కూడ దీసి, ఒక చిన్న నాటకసంఘం స్థాపించాడు. దానికి 'వాణీథియేటర్స్!' అనీ పేరుపెట్టాడు!

సుందర్రామయ్యా, రామలక్ష్మీకూడా రవికి అడ్డు చెప్పలేదు!

'చదువు మాత్రం చెడకుండా చూసుకో!' అని మాత్రం చెప్పాడు సుందర్రామయ్య.

ఊళ్ళో ఏ ఉత్సవాలు జరిగినా, రవి స్థాపించిన సంఘం ఏదో ఒక నాటిక ప్రదర్శిస్తూనే వుంది! రవీ ప్రతిసారీ తన నటనాచాతుర్యంతో అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేస్తున్నాడు!

(సశేషం)